RNI No - APTEL/2022/81596

janodaya

# జనోదయ

తెలుగు దినపత్రిక

కరీంనగర్ బుధవారం 27.05.2026 సంపుటి : 03 సంచిక : 168 పేజీలు : 08 వెల : రూ.5

Karimnagar Wednesday 27.05.2026 Volume: 03 Issue 168 Pages 08 Cost 5/




## సిద్దూ ఔట్.. ముఖ్యమంత్రి పదవికి రేపు రాజీనామా ?

పదవి నుంచి వైదొలగాలని కోరిన కాంగ్రెస్ హైకమాండ్!

రాజ్యసభ సీటు.. కొడుక్కు డిప్యూటీ సీఎం పదవి ఆఫర్!

డీకే శివకుమార్‌కు ముఖ్యమంత్రిగా అవకాశం?



6లో..

## పంట అవశేషాలను కాల్చొద్దు

రైతులు పంట అవశేషాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు.

- తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదం
- భూసారం పూర్తిగా దెబ్బతింటుంది
- పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు
- యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలం
- ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం
- రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి

మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు



వివరాలు..2లో

## వరల్డ్‌కప్ ముందర మెస్సీకి గాయం

### పరేషాన్‌లో అర్జెంటీనా..!

ఫిఫా ప్రపంచకప్ సమీపిస్తున్న వేళ అర్జెంటీనాకు బిగ్ షాక్. గత సీజన్‌లో సంచలన ఆటతో జట్టును విజేతగా నిలిపిన లియోనల్ మెస్సీ అనూహ్యంగా గాయపడ్డాడు. మెగా టోర్నీకి సన్నద్ధత శిబిరానికి ముందే తొడ కండరాల గాయంతో బాధ పడుతున్న మెస్సీ.. సాకర్ వరల్డ్‌కప్ ఆడడంపై సందేహాలు నెలకొన్నాయి. దాంతో, దిగ్గజ ఆటగాడి సేవల్ని కోల్పోతామా? అని అర్జెంటీనా టీమ్, అభిమానులు పరేషాన్ అవుతున్నారు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా సాకర్ ప్రపంచకప్‌ను నిలబెట్టుకోవాలనుకుంటున్న అర్జెంటీనా బిగ్ షాక్ తప్పేలా లేదు. నాలుగేళ్ల క్రితం ఖతార్‌లో ఫ్రాన్స్‌పై మెరుపు గోల్స్‌తో ట్రోఫీ అందించిన కెప్టెన్ లియోనల్ మెస్సీ ఈసారి టోర్నీకి దూరమయ్యేలా ఉన్నాడు. బ్రిటన్‌కు చెందిన ఇంటర్ మియామి క్లబ్‌కు ఆడుతున్న లియోన్ మెస్సీ ఆదివారం మ్యాచ్ ఆడుతూ మైదానంలో గాయపడ్డాడు. ఎడమ కాలి నొప్పి కారణంగా అతడు ఇలా వచ్చి అలా బయటకు వెళ్లాడు.

'మేజర్ లీగ్ సాకర్‌లో ఫిలడెల్ఫియా యూనియన్‌తో మ్యాచ్‌లో మెస్సీ గాయపడ్డాడు. ఎడమ తొడ కండరాల నొప్పితో విలవిలలాడుతూ అతడు మైదానంలో కూలబడ్డాడు. వైద్య పరీక్షల అనంతరం అతడు కండరాల అలసటతో బాధ పడుతున్నాడని తెలిసింది. తొడ కండరాల గాయం నుంచి కోలుకోవడం అనేది వైద్యపరమైన అంశాలు, శారీరక స్పందనపై ఆధారపడి ఉంది. ఈ గాయం నుంచి కోలుకునేందుకు ఒక్కోసారి కొన్ని రోజుల్లోనే కొన్నిసార్లు.. వారాలు పడుతుంది' అని ఇంటర్ మియామి క్లబ్ ఓ ప్రకటనలో తెలిపింది. జూన్ 11 నుంచి ఫిఫా ప్రపంచకప్ మొదలవ్వనుంది. జూన్



16న అల్జీరియాతో అర్జెంటీనా తలపడనుంది.

### టాయిలెట్లు, శానిటరీ నాప్‌కిన్స్ లేవని

## బాలికలు స్కూల్ మానేయొద్దు

### సుప్రీం కోర్టు సూచన

**ఢిల్లీ:** దేశంలోని విద్యా సంస్థల్లో టాయిలెట్లు, శానిటరీ న్యాప్‌కిన్స్ లేని కారణంగా బాలికలు చదువు మానేయకుండా చూడాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. ఈ మేరకు కేంద్రానికి, రాష్ట్రాలకు, కేంద్రపాలిత ప్రాంతాలకు సూచనలు చేసింది. జస్టిస్ బీ పర్దివాలా, ఆర్ మహదేవన్ ఆధ్వర్యంలోని బెంచ్ తాజాగా ఈ అంశంపై కీలక ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికీ దేశంలోని విద్యాసంస్థల్లో బాలికలకు ప్రత్యేకంగా టాయిలెట్లు లేవని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. ఈ విషయంలో గత జనవరి 30న జారీ చేసిన ఆదేశాలను అమలు చేయాలని ప్రభుత్వాలకు సూచించింది. విద్యా సంస్థల్లో శానిటరీ న్యాప్‌కిన్స్ అందుబాటులో ఉంచాలని, బాలికల కోసం విడిగా టాయిలెట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. బయోడీగ్రేడబుల్ శానిటరీ న్యాప్‌కిన్స్ అందించాలని సూచించింది. ఇవి సద్వినియోగం అయ్యేలా చూడాలని, దీనివల్ల దేశంలోని బాలికలు, మహిళలకు ఎంతో మేలు చేస్తుందని కోర్టు అభిప్రాయపడింది. ఈ సదుపాయాలు లేని కారణంగానే చాలా మంది ఆడపిల్లలు చదువు మానేసి, ఇంట్లో పనులకు అంకితమవుతున్నారని కోర్టు వ్యాఖ్యానించింది. ఈ తీర్పును ప్రభుత్వాలు అమలు చేయడం, దాని ఫలాలు అందరికీ అందేలా చూడటం ప్రభుత్వాల బాధ్యత అని కోర్ట్ తెలిపింది. గతంలో ఆదేశించిన ప్రకారం ప్రభుత్వ విద్యా సంస్థల్లో టాయిలెట్లు, శానిటరీ న్యాప్‌కిన్స్ ఏర్పాటు వంటి అంశాల్లో రాష్ట్ర ప్రభుత్వాల నుంచి డాటా సేకరించారా అని కేంద్రాన్ని ప్ర



శ్నించింది. దీనికి రెండు నెలల క్రితమే ప్రాథమిక డాటా సేకరించినట్లు కేంద్రం బదులిచ్చింది. ఈ అంశంలో రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కేంద్రం నిరంతరం డాటా సేకరించి, తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ప్రతి మూడు నెలలకు ఒకసారి నివేదిక తెప్పించుకోవాలని కోర్టు ఆదేశించింది.

## అక్రమ వలసలపై హైలెవల్ కమిటీ

### అమిత్ షా ఆదేశం

దేశంలో జనాభాలో వస్తున్న అనవసర మార్పులు, అక్రమ వలసలపై అధ్యయనం చేసేందుకు ఒక హైలెవల్ కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. ఈ అంశంపై ఎక్స్ వేదికగా మంగళవారం అమిత్ షా స్పందించారు. గత ఏడాది ఆగస్టు 15న ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రకటనకు అనుగుణంగా ఈ కమిటీని ఏర్పాటు చేస్తున్నామన్నారు. అమిత్ షా వెల్లడించిన వివరాల ప్రకారం.. రిటైర్డ్ జస్టిస్ ప్రకాష్ ప్రభాకర్ నోలేకర్ ఈ కమిటీకి నేతృత్వం వహిస్తారు. ఈ కమిటీలో జనాభా లెక్కల కమిషనర్, రిటైర్డ్ ఐఏఎస్ దుర్గా శంకర్ మిశ్రా, రిటైర్డ్ ఐపీఎస్ బాలాజీ శ్రీవాస్తవ, ప్రముఖ ఆర్థిక వేత్త డా.షామికా రవి సభ్యులుగా ఉంటారు. హోం అఫైర్స్ మంత్రిత్వ శాఖకు చెందిన జాయింట్ సెక్రెటరీ కూడా ఇందులో సెక్రెటరీ మెంబర్‌గా వ్యవహరిస్తారు. జనాభాలో కలుగుతున్న అనియంత్రిత మార్పులు జాతీయ సమగ్రతకు, భద్రతకు, శాంతి భద్రతలకు, ఆదిమ తెగ సమాజానికి ముప్పుగా మారాయని అమిత్ షా భావిస్తున్నారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో జనాభా వేగంగా పెరగడం, అక్రమ వలసలు, ఇతర అసహజ కారణాలను ఈ కమిటీ అధ్యయనం చేస్తుంది. మతపరంగా, సామాజిక వర్గాల పరంగా జనాభా ఎలా పెరుగుతుందో ఈ కమిటీ అంచనా వేయనుంది. దీనికి తగిన



పరిష్కారాల్ని కూడా కమిటీ సూచించనుంది. అక్రమ వలసలు దేశ సమగ్రతకు ముప్పుగా మారాయని బీజేపీ ఎప్పటినుంచో చెబుతోంది. ఈ నేపథ్యంలో వీటిని అరికట్టేందు కూడా ఈ కమిటీ ఉపయోగపడనుంది.

## జాడలేని నైరుతి
## తప్పిన ఐఎండీ అంచనాలు

- దేశవ్యాప్తంగా రైతులు, జనం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కానున్నది.
- మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది.
- అయితే ఆ అంచనాలు పూర్తిగా తప్పాయి కేరళను నైరుతి రుతుపవనాలు తాకేందుకు అనువైన పరిస్థితులు ఇంకా ఏర్పడలేదు



2లో..

# జాడలేని నైరుతి
# తప్పిన ఐఎండీ అంచనాలు

- దేశవ్యాప్తంగా రైతులు, జనం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కానున్నది.
- మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది.
- అయితే ఆ అంచనాలు పూర్తిగా **తప్పాయి** కేరళను నైరుతి రుతుపవనాలు **తాకేందుకు** అనువైన పరిస్థితులు ఇంకా **ఏర్పడలేదు**
- దాంతో రుతుపవనాలు సాధారణ తేదీ అయిన జూన్ 1 కంటే కొద్దిగా **ఆలస్యంగా** అంటే జూన్ 2 నుంచి 4 మధ్య కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తాజా అంచనాలు స్పష్టం చేస్తున్నాయి.



**ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ ఇప్పటికే హెచ్చరించింది.**


**ఢిల్లీ:మే26:** దేశవ్యాప్తంగా రైతులు, జనం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాల రాక ఆలస్యం కానున్నది. మే 26న నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయని భారత వాతావరణ కేంద్రం అంచనా వేసింది. అయితే ఆ అంచనాలు పూర్తిగా తప్పాయి. కేరళను నైరుతి రుతుపవనాలు తాకేందుకు అనువైన పరిస్థితులు ఇంకా ఏర్పడలేదు. దాంతో రుతుపవనాలు సాధారణ తేదీ అయిన జూన్ 1 కంటే కొద్దిగా ఆలస్యంగా.. అంటే జూన్ 2 నుంచి 4 మధ్య కేరళలోకి ప్రవేశించే అవకాశం ఉందని ఐఎండీ తాజా అంచనాలు స్పష్టం చేస్తున్నాయి.రుతుపవనాల ఆగమనాన్ని ప్రకటించడానికి కొన్ని నిర్దిష్ట ప్రమాణాలు అవసరం. కేరళలోని 14 కేంద్రాలలో కనీసం 60 శాతం కేంద్రాల్లో వరుసగా రెండు రోజులపాటు 2.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాలి. దాంతోపాటు గాలి వేగం, మేఘాల సాంద్రత వంటివి కూడా అనుకూలంగా ఉండాలి. అయితే మే 25 నాటికి ఈ పరిస్థితులు ఇంకా ఏర్పడలేదని ఐఎండీ తెలిపింది. ప్రస్తుతం కేరళలోని తిరువనంతపురం, కొల్లాం, అలప్పుజ, ఎర్నాకుళం జిల్లాల్లో సాధారణంగా కురిసే తొలకరి జల్లులు పడుతున్నాయి.ఒకవైపు రుతుపవనాల రాక ఆలస్యం అవుతుండగా.. మరోవైపు ఉత్తర, మధ్య, పశ్చిమ భారతదేశంలో తీవ్రమైన వేడిగాలులు ప్రజలను అల్లాడిస్తున్నాయి. ఢిల్లీలో పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్నాయి. రుతుపవనాలు కేరళను తాకిన తర్వాత కూడా ఉత్తర దిశగా వాటి కదలిక నెమ్మదిగా, తీవ్రత తక్కువగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ ఇప్పటికే హెచ్చరించింది. ఈ నేపథ్యంలో కొన్ని రోజుల ఆలస్యం పెద్ద సమస్య కాకపోయినా, మొత్తం సీజన్‌లో వర్షపాతం ఎలా ఉంటుందనేది ఆందోళన కలిగిస్తోంది.

---

# పంట అవశేషాలను కాల్చొద్దు

**రైతులు పంట అవశేషాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు.**

- తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదం
- భూసారం పూర్తిగా దెబ్బతింటుంది
- పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు
- యూరియా సరఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలం
- ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు తగ్గే అవకాశం
- రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలి



**మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు**

**హైదరాబాద్:** రైతులు పంట అవశేషాలను కాల్చకుండా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సూచించారు. పంట వ్యర్థాలను తగలబెట్టడం రైతుల భవిష్యత్తుకే ప్రమాదమని ఆయన హెచ్చరించారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల భూసారం పూర్తిగా దెబ్బతింటుందని, నేలలోని పోషకాలు తగ్గిపోవడంతో యూరియా, పురుగుమందుల ప్రభావం కూడా తగ్గిపోతుందని మంత్రి తెలిపారు. అందువల్ల పంట అవశేషాలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని రైతులకు సూచించారు.రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు అందజేస్తామని మంత్రి వెల్లడించారు. అయినప్పటికీ పంట అవశేషాలను కాల్చితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కూడా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. శాటిలైట్ సాంకేతికత ద్వారా పంట అవశేషాల దహనాన్ని గుర్తిస్తున్నామని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు.యూరియా సరఫరా విషయంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల ఆరోపించారు. యుద్ధ ప్రభావంతో యూరియా సరఫరాలో అంతరాయం ఏర్పడిందని పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందే కేంద్రాన్ని పలుమార్లు కోరినా సరఫరా సమస్య కొనసాగుతోందన్నారు. యూరియా సరఫరా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పరిధిలోనే ఉంటుందని చెప్పారు.రాష్ట్రంపై బీజేపీ చేస్తున్న విమర్శలు అన్యాయమని మంత్రి వ్యాఖ్యానించారు. ఎల్‌నినో ప్రభావంతో సాధారణంగా పడే వర్షాలు తగ్గే అవకాశం ఉందని మంత్రి హెచ్చరించారు. అందువల్ల రైతులు పంటల ఎంపికలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయిల్ పామ్ రైతులకు భరోసా ఇచ్చే పంటగా మారుతోందని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో రైతులు స్థిరమైన ఆదాయం పొందే అవకాశం ఉందని చెప్పారు. రైతు సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.

# ఐకెపి కొనుగోలు కేంద్రాలలో రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## బిజెపి డిమాండ్

జనోదయ : గోదావరిఖని

పాలకుర్తి మండలంలోని ధాన్యం, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని భారతీయ జనతా పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు పాలకుర్తి మండల బీజేపీ అధ్యక్షులు మేరుగు నరేష్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ...మండలంలోని ఐకెపి కొనుగోలు కేంద్రాలలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కొనుగోలు ప్రక్రియలో అధికారులు, మిల్లర్లు కలిసి రైతులను "బి–కేటగిరి" పేరుతో ఇబ్బందులకు గురిచేస్తూ అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు.రైతుల ధాన్యానికి తేమ శాతం పేరుతో అనవసర కోతలు విధించడం, అలాగే "తాలు", "తరుగు" పేరుతో అధిక కోతలు పెట్టడం లేకపోవడం, ముఖ్యంగా తార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు ధాన్యం తడిసి రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.రైతుల సమస్యలను ప్రత్యక్షంగా




తెలుసుకునేందుకు బీజేపీ మండల అధ్యక్షులు మేరుగు నరేష్ ఐకెపి కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులతో మాట్లాడారు.ప్రభుత్వం వెంటనే స్పందించి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రతి కొనుగోలు కేంద్రంలో తార్పాలిన్లు, తాగునీరు, షెడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పని రాజకుమార్, కంకట శ్రీనివాస్, గోపు రామయ్య, కొలిపాక శంకరయ్య,రావుల చిన్నన్న, వేల్పుగొండ సంపత్, పూసాల శంకరయ్య, జట్పట్ తిరుపతి, కొమురె లక్ష్మణ్, మబ్బు సాయికిరణ్, నందీష్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# గంగాధర కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుగా మంత్రి మహేందర్

### అభివృద్ధికి చిరునామా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

### చొప్పదండి నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రచారం చేస్తాం

జనోదయ : గంగాధర



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో గంగాధర మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి పనిచేస్తాం.గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా మంత్రి మహేందర్ నియామకం అయ్యారు. గంగాధర మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా నియామకమైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చొప్పదండి నియోజకవర్గం లో అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్ గా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నిలుస్తారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గంగాధర మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రచారం చేస్తామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్ అన్నారు. తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం కు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు మహేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

# బీఆర్ఎస్ కోసం అహర్నిశలు శ్రమించిన నేత హరీశ్‌రావు

### రాజకీయ ఒడిదుడుకుల్లోనూ చెక్కుచెదరని పోరాట పటిమ

### బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు డా. హరి రమాదేవి

జనోదయ : వరంగల్ ప్రతినిధి

బీఆర్ఎస్ పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసిన నాయకుడు తన్నీరు హరీశ్‌రావు అని కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు డా. హరి రమాదేవి కొనియాడారు. కుమారుని గ్రాడ్యుయేషన్‌కు హాజరై అమెరికా పర్యటన ముగించుకుని వచ్చిన మాజీ మంత్రి హరీశ్‌రావును మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసిన సందర్భంగా డా. హరి రమాదేవి మాట్లాడుతూ.. "తెలంగాణ ఉద్యమం నుంచి నేటి వరకు పార్టీ కోసం హరీశ్‌రావు చేసిన సేవలు మరువలేనివి. ఎన్నో రాజకీయ ఒడిదుడుకులు ఎదురైనా, విమర్శలు వచ్చినా ఆయన నిబద్ధతతో పనిచేశారన్నారు. సిద్దిపేట అభివృద్ధి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రిగా ఆయన పనితీరు ఆదర్శనీ



యం" అని అన్నారు. "తెలంగాణ ఉద్యమ సమయంలో కీలక పాత్ర పోషించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కార్యకర్తలకు ధైర్యం నింపారు. ఓటమి, గెలుపులను సమానంగా స్వీకరించి పార్టీకి వెన్నెముకలా నిలిచారు" అని డా. హరి రమాదేవి పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు తుల ఉమ కూడా హరీశ్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

# భద్రకాళి భూ నిర్వాసితులకు అండగా ప్రభుత్వం



### కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి లబ్ధిదారులకు మొదటి నెల జీతం అందజేత

జనోదయ : హనుమకొండ

భద్రకాళి దేవాలయ మాడవీధుల నిర్మాణం కోసం తమ భూములను స్వచ్ఛందంగా అప్పగించిన 17 నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ పూర్తి స్థాయిలో అండగా నిలిచింది. రెండు నెలల క్రితం న్యూ శాయంపేటలోని డబుల్ బెడ్రూం ఇళ్ల పట్టాలను కుడా కార్యాలయంలో కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ కలెక్టర్ అండ్ కుడా వైస్ ఛైర్మన్ చాహత్ బాజ్ పేయి కలిసి లక్కీ డ్రా ద్వారా అత్యంత పారదర్శకంగా కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ ఇళ్ల కేటాయింపుతో పాటుగా, గత నెలలోనే ఆయా కుటుంబాల్లోని ఒకరికి భద్రకాళి బండ్ ప్రాజెక్టులో ఉద్యోగ అవకాశాలు కల్పించి ప్రభుత్వం వారికి ఆర్థిక భరోసానిచ్చింది.ఈ నేపథ్యంలో.. ఉద్యోగంలో చేరి విజయవంతంగా మొదటి నెల పూర్తి చేసుకున్న లబ్ధిదారులకు మంగళవారం కుడా కార్యాలయంలో మొదటి నెల జీతాల పంపిణీ చేశారు. కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, పీవో అజిత్ రెడ్డి కలిసి లబ్ధిదారులకు మొదటి నెల వేతన నగదును స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా ఇల్లు, ఉద్యోగంతో పాటు మొదటి నెల జీతం కూడా సకాలంలో చేతికి అందడంతో ఆ 17 నిర్వాసిత కుటుంబాల సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. తమకు పునరావాసంతో పాటు ఉపాధి కల్పించి ఆదుకున్నందుకు ప్రభుత్వానికి, స్థానిక ప్రజాప్రతినిధులకు, కుడా అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

# ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే మా బాధ్యత

### బూత్ లెవల్ ఏజెంట్ల అవగాహన సదస్సులో పాల్గొన్న వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

జనోదయ : హనుమకొండ

అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన బూత్ లెవల్ ఏజెంట్ల (బి ఎల్ ఏ ) అవగాహన సదస్సులో శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనుగాల వెంకటరామిరెడ్డి తో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ కడియం కావ్య రూపొందించిన బూత్ లెవల్ ఏజెంట్స్ సంక్షిప్త సమాచారం హ్యాండ్‌బుక్ ను ఆవిష్కరించి, బి ఎల్ ఏ లకు, డివిజన్ ఇన్‌చార్జ్‌లకు అందజేశారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి బూత్ స్థాయి కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రతి ఓటరుతో ప్రత్యక్ష సంబంధాలు పెంపొందించుకుంటూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో బి ఎల్ ఏ లు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో సార్ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిషన్ ) ప్రక్రియ పేరుతో ఓటర్ల జాబితాల్లో జరుగుతున్న మార్పులను గమనించాలని, రాష్ట్రంలో ఇలాంటి పరిస్థితులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ప్రతి బి



ఎల్ ఏ వద్ద తాజా ఓటర్ల జాబితా ఉండాలని, కొత్త ఓటర్ల నమోదు, తొలగింపులు, అనుమానాస్పద ఓట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు.బి ఎల్ ఏ లు, బి ఎల్ ఓ లతో కలిసి వచ్చే మూడు నెలలు డోర్ టు డోర్ ప్రచారం నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, ఓటర్ల జాబితానే ఎన్నికల్లో గెలుపుకు తొలి అడుగు అని పేర్కొన్నారు. "మన ఓటును మనమే కాపాడుకోవాలని, ప్రతి బి ఎల్ ఏ ఒక సైనికుడిలా పని చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సమిష్టిగా కృషి చేయాలి అని ఎంపీ డాక్టర్ కడియం కావ్య పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో బి ఎల్ ఏ లు, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎం ఆర్ ఓ లు తదితరులు పాల్గొన్నారు.

# ఎడ్యుకేషన్ హబ్‌గా చొప్పదండి నియోజకవర్గం

**చొప్పదండిలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్**

**రామడుగులో అడ్వాన్సుడ్ ట్రైనింగ్ సెంటర్**

**గంగాధరలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల**

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

జనోదయ : గంగాధర

గంగాధర లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు, టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులను మంజూరు చేసిన సందర్భంగా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేసిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో చొప్పదండి నియోజకవర్గాన్ని తీర్చిదిద్దుతున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. గంగాధర లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయడంతో పాటు, టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులు మంజూరు చేసిన సందర్భంగా గంగాధర మండలం మధురానగర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ




గంగాధర మండలం తోపాటు చుట్టుపక్కలాల మండల పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలనే సదుద్దేశంతో తెలంగాణ మొదటి శాసనసభ సమావేశాల్లోనే చొప్పదండి నియోజకవర్గం వర్గానికి డిగ్రీ కళాశాల మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. తమ అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొప్పదండి నియోజకవర్గం వర్గానికి డిగ్రీ కళాశాలను మంజూరు చేసినట్టు తెలిపారు. రాజకీయాలకతీతంగా చొప్పదండి నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్ తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఇందులో భాగంగా చొప్పదండిలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల, రామడుగులో అడ్వాన్సుడ్ ట్రైనింగ్ సెంటర్, గంగాధర లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించినట్లు తెలిపారు. మిగతా మండలాల్లో కూడా తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. చొప్పదండి నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రజలు సహకరించాలని కోరారు. గంగాధర మండలానికి డిగ్రీ కళాశాల మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చొప్పదండి నియోజకవర్గం ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, బోయినపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్ ,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పురుమల్ల మనోహర్,ఇప్ప శ్రీనివాస్ రెడ్డి,సువిన్ యాదవ్,సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చయ్య, మాజీ జెడ్పిటిసి సభ్యుడు సత్తు కనుకయ్య, సర్పంచులు వేముల భాస్కర్, రామిడి రాజిరెడ్డి, బారాజు ప్రభాకర్ రెడ్డి, రాచమల్ల రవి, బాసవేణి శ్రీనివాస్,దాసరి శంకరయ్య, చందం ఆంజనేయులు , బిర్లా ఆనందం,కాంగ్రెస్ నాయకులు గోగురి మహిపాల్ రెడ్డి, మల్లికార్జున రెడ్డి, నాగభూషణ్ రెడ్డి, బత్తిని శ్రీనివాస్ గౌడ్,పడాల రాజన్న, కర్ర విద్యా సాగర్ రెడ్డి, మంత్రి మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ అక్షరాస్యతే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

**జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు**

జనోదయ : అందోల్

సంపూర్ణ అక్షరాస్యత నే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమనిజోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ అన్నారు. జోగిపేటలోని మున్సిపల్ కార్యాలయంలో ఆర్‌పీ, బీఎల్ఓలతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన 'ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమం'లో భాగంగా అందోల్--జోగిపేట మున్సిపాలిటీ పరిధిలో మంగళవారం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరక్షరాస్యతను పూర్తిగా నిర్మూలించి రాష్ట్రాన్ని సంపూర్ణ అక్షరాస్యత వైపు నడిపించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని 15 నిండిన ప్రతి నిరక్ష్యరాస్యుడిని గుర్తించి చదవడం, రాయడం లెక్కలు నేర్పించి అక్షరాస్యులుగా తీర్చిదిద్దే భాధ్యత మనందరిపై ఉందన్నారు. ఉల్లాస్ అనేది కేవలం ఒక పథకం కాదని, సామాజిక ఉద్యమమని, ఆర్‌పీలు, బీఎల్




ఓలు ప్రతి వార్డులో నిరక్ష్యరాస్యులను గుర్తించాలని ఈ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాల మేరకు మున్సిపాలిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఓ మౌనిక, స్వరూప, కోఆర్డినేటర్ బిక్షపతితో పాటు ఏఎల్ఎఫ్, ఆర్‌పీలతో పాటు పలువురు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోనే ఉత్తమ బోధన

జనోదయ : మోత్కూర్

ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన బోధన ఉంటుందని మోత్కూరు మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న అన్నారు.మంగళవారం మోత్కూరు ఉన్నత పాఠశాల లో జరిగిన బడిబాట కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన అత్యుత్తమ విద్యార్హతలు కలిగిన ఉపాధ్యాయులచే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దేవినేని అరవిందరాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జి లక్ష్మీ నరసింహా రెడ్డి మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ దబ్బేటి శైలజ కౌన్సిలర్లు కుర్మేళ ప్రమీల పన్నాల శ్రీ విద్య శ్రీనివాస్ రెడ్డి, అల్లాడి సోమేశ్వర్ మరియు



ఉపాధ్యాయులు టి.అంజయ్య ,ఇ.రాంప్రసాద్ సుధీర్ కుమార్ డి మంజుల ఏ.వెంకటాచారి,జె.ప్రవీణ్ డి.స్వప్న,జె.రవికుమార్ , ఆర్.వెంకటాచారి ,మర్రి జయశ్రీ టి. ఉప్పలయ్య ఎం వెంకటేశ్వర్లు ఎం అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# నవతెలంగాణ రిపోర్టర్ కిరణ్ కుమార్ దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు




**స్నేహితులకు సహాయకారి, వార్తల రచనలో అనుభవశాలి**

**జెఎస్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరు శ్రీనివాస్ ప్రశంస**

జనోదయ : వరంగల్ ప్రతినిధి

నవతెలంగాణ రిపోర్టర్ బావండ్లపల్లి కిరణ్ కుమార్ దంపతుల పెళ్లిరోజు సందర్భంగా జర్నలిస్ట్ల సంక్షేమ సంఘం (జెఎస్ఎస్) వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, జనోదయ జిల్లా ప్రతినిధి సిలువేరు శ్రీనివాస్, ఇతర మిత్ర బృందం హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిలువేరు శ్రీనివాస్ మాట్లాడుతూ.. కిరణ్ కుమార్ స్నేహితులకు ఎల్లప్పుడూ సహాయకారిగా ఉంటారని, వార్తలు వ్రాయడంలో అనుభవశాలిగా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. వృత్తిపరంగా నిబద్ధతతో పనిచేస్తూ.. అధికారులు, నాయకులు, ప్రజల మన్ననలు పొందుతున్నారని అన్నారు. కిరణ్ కుమార్ దంపతులు తమ పెళ్లిరోజు వేడుకలను కుటుంబ సభ్యులు, మిత్రుల మధ్య ఆనందంగా జరుపుకున్నారన్నారు. దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, వారి దాంపత్య జీవితం అన్యోన్యంగా సాగాలని మిత్రులు, శ్రేయోభిలాషులు ఆకాంక్షించారు.

జన్మదినోత్సవాలు, పదవీ విరమణ శుభాకాంక్షల
ప్రకటనల కోసం సంప్రదించండి
8074124190



# బీ.ఆర్.ఎస్ పార్టీ సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలి

జనోదయ : ఆర్ సి చెన్నూర్

మంచిర్యాల జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు చెన్నూరు మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ ఆదేశాల మేర కుమంగళవారం ఉదయం చెన్నూరు మండలం అస్నాద్ గ్రామంలో బీ.ఆర్.ఎస్ పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అస్నాద్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న డిజిటల్ సభ్యత నమోదు గ్రామ ఇన్చార్జి.చెన్నూరు మాజీ ఎంపీపీ మంత్రి బాపు అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేస్తేనే డిజిటల్ సభ్యత నమోదు పూర్తవుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కే.టీ. రామారావు పార్టీ డిజిటల్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంతో పాటు పార్టీ కార్యకర్తల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని కార్యకర్తలకు ఎటువంటి ప్రమాదం జరిగిన మరియు అకాల మరణం సంభవించిన రెండు లక్షల ఎక్స్గ్రేషియా. ప్రమాద బీమా ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవడం హర్షించదగ్గ విషయం అన్నారు. తెలంగాణ తొలిముఖ్యమంత్రి కెసిఆర్ రాష్ట్రంలో చేసిన పనులు. ప్రభుత్వ పథకాలే బీఆర్ఎస్ పార్టీని వచ్చే రెండేళ్లలో అధికారంలోకి తీసుకు వస్తాయన్నారు. నాడైనా నేడైనా బిఆర్ఎస్ పార్టీ జెండా కార్యకర్తలకు అండగా ఉంటుందని అన్నారు. అస్నాద్.సోమనపల్లి ఒత్తుకులపల్లి కొమ్మెర చాకపల్లి పొన్నారం గంగారం గ్రామాలలో బీ ఆర్ఎస్ పార్టీ



బలంగా ఉందని కార్యకర్తలు కూడా చురుకుగా పనిచేస్తున్నారని ఇదే ఒరవడిని కొనసాగిస్తే ఎంతటి లక్ష్యాన్ని అయినా సాధించవచ్చు అని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేసి డిజిటల్ సభ్యత నమోదును వెనుక అడుగు వేయకుండా ప్రతి ఒక్కరిని ఎన్రోల్మెంట్ చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎనగంటి వెంకటేశ్వరావు. ఏలేశ్వరం నర్సింహాచారి. తాటి రవి గౌడ్. ఇంగిలి వెంకట స్వామి. సోకుల స్వామి. ఇంగిలి రవి. బల్ల శ్రీకాంత్. కస్తూరి మల్లయ్య. ఎనగందుల రవి. వడ్లకొండ జితేందర్. ఎడ్ల లక్ష్మణ్. నాస్కురి శ్రీనివాస్. ఇంగిలి చిన్న లచ్చన్న. సంతోష్ రాజ్.పంతే దేవేందర్. దాదా సంపత్. యోగితో పాటు ముఖ్య నాయకులు కార్యకర్తలు సోషల్ మీడియా యూత్ నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ నూతన గృహాన్ని ప్రారంభించిన రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్



జనోదయ : గోదావరిఖని

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మర్రిపల్లి గ్రామం లోని కందుగుల స్వాతి-చందు దంపతుల నూతన ఇందిరమ్మ నూతన గృహాన్ని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ మంగళవారం ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే రాజు ఠాగూర్ మాట్లాడుతూ గూడు లేని వారికి సొంత గూడు ఇవ్వాలి కట్టాలనే ఉద్దేశంతో మా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో భాగంగా అంతర్గాం మండలంలోని సుమారు 40నుండి 50 ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగానే మండలంలోనే మొట్టమొదటిసారిగా పూర్తిచేసిన ఇందిరమ్మ నూతన గృహం మర్రిపల్లి గ్రామానికి చెందిన కందుకూల స్వాతి-చందు దంపతుల నూతన గృహం త్వరగా పూర్తి చేసుకొని నూతన గృహ ప్రవేశం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అనంతరం మండలంలోని గ్రామ ప్రజలకు రెండవ విడతలో ఇల్లు లేని వారికి ఇల్లు భూమి ఉన్నవారికి ఇల్లు అలాగే పింఛన్ రాని వారికి పింఛన్ కూడా తప్పకుండా ఇస్తానని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ నూతన గృహ దంపతులు కందుగుల స్వాతి- చందు, గ్రామ సర్పంచ్విమల -గద్దలరాజయ్య, ఉప సర్పంచ్ చిలుక సాగర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐకేపీ సెంటర్‌లో గుండెపోటుతో రైతు మృతి

## మృతుని కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

## కలెక్టర్‌ను కోరిన రైతు సంఘాల నాయకులు

జనోదయ : వరంగల్ ప్రతినిధి

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన రైతు గాజుల పెద్ద వెంకటేశ్వర్లు గుండెపోటుతో 17వ తేదీన ఐకేపీ సెంటర్‌లో వరి ధాన్యం కుప్పపై పడి మరణించాడని, ఆయన కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా రైతు సంఘాల నాయకులు కోరారు. మంగళవారం జిల్లా అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి ని కలిసి ఘటనను వివరించారు. మృతుడికి నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని, మూడు ఎకరాల్లో వరి పండించి పీఏసీఎస్ సొసైటీ కొనుగోలు సెంటర్‌లో 15 రోజుల క్రితమే ధాన్యాన్ని ఆరబోశాడని తెలిపారు. కాంట కోసం ప్రతిరోజూ ఉదయం నుంచి రాత్రి 11-12 గంటల వరకు ధాన్యం వద్దే ఉండేవాడని, ఎండ తీవ్రత తట్టుకోలేక 17వ తేదీ సాయంత్రం గుండెపోటుతో మరణించాడని వివరించారు. పంట కొనుగోలు చేయడంలో సొసైటీ అధికారుల నిర్లక్ష్యం వల్లనే రైతు చనిపోయాడని నాయకులు ఆరోపించారు. మృతుడు ఇండియన్ ఓవర్సీస్




బ్యాంకు నుంచి పంట రుణం తీసుకున్నాడని, ప్రభుత్వం ప్రకటించిన రెండు లక్షల రుణమాఫీ కూడా కాలేదన్నారు. ఆయన వయసు 62 ఏళ్లు ఉండడంతో రైతు బీమా పథకానికి కూడా అర్హుడు కాదని తెలిపారు. కావున మృతుని బ్యాంకు అప్పులను మాఫీ చేసి, కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ఆదుకోవాలని అడిషనల్ కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ ను కలిసిన వారిలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్, ఏఐకేఎంఎస్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు, అఖిలభారత కిసాన్ సంఘటన్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ సుధమల్ల భాస్కర్, రైతు సంఘం జిల్లా నాయకులు మూకిడే పీరయ్య ఉన్నారు.

# మహిళా భద్రతపై గోడపత్రిక ఆవిష్కరించిన వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్



## అవగాహన కల్పించడమే లక్ష్యం

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జనోదయ : వరంగల్ ప్రతినిధి

మహిళల భద్రత, రక్షణపై అవగాహన కల్పించేందుకు రూపొందించిన గోడపత్రికను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ.. మహిళలపై జరుగుతున్న నేరాల నివారణకు, వారిలో చైతన్యం తీసుకురావడానికి ఈ గోడపత్రిక ఉపయోగపడుతుందన్నారు. షీ టీమ్స్, భరోసా సెంటర్, డయల్ 100, 181 వంటి హెల్ప్‌లైన్ నంబర్లపై ప్రతి మహిళకు అవగాహన ఉండాలన్నారు. సైబర్ నేరగాళ్ల వలలో పడకుండా మహిళలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు షేర్ చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని, అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని తెలిపారు.మహిళలకు ఏదైనా సమస్య వస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని సీపీ భరోసా ఇచ్చారు.

# ప్రజల రక్షణలో పోలీసుల సేవలు అభినందనీయం

## మల్కాజిగిరి సీపీ బడుగుల సుమతిని కలిసి ప్రశంసించిన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి

జనోదయ : వరంగల్ ప్రతినిధి

పోలీసులు నిత్యం ప్రజల రక్షణ కోసం చేస్తున్న సేవలు అభినందనీయమని గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి అన్నారు. మంగళవారం మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బడుగుల సుమతిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో సత్కరించిన రాజనాల శ్రీహరి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ చూపిస్తున్న చొరవ, ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు."నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, మహిళల భద్రత, విపత్తుల సమయంలో సహాయక చర్యలు..



ఇలా 24 గంటలూ పోలీసులు అప్రమత్తంగా ఉంటున్నారు. పండుగలు, ఎన్నికలు, ఆందోళనల సమయంలో కుటుంబాలను వదిలి విధులు నిర్వర్తిస్తున్నారు. వారి త్యాగం, నిబద్ధత సమాజానికి ఎంతో అవసరం" అని రాజనాల శ్రీహరి పేర్కొన్నారు. సీపీ బడుగుల సుమతి నేతృత్వంలో మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలు మెరుగ్గా ఉన్నాయని, ఫ్రెండ్లీ పోలీసింగ్‌తో ప్రజలకు మరింత చేరువవుతున్నారని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులో కూడా పోలీస్ శాఖకు తమ సంపూర్ణ సహకారం ఉంటుందని తెలిపారు.

# నిత్యం జామ్,ట్రాఫిక్ జామ్



జనోదయ : జూబ్లీహిల్స్

ఐటీ సెక్టార్, హైటెక్ సిటీకి పోయే దారి,ప్రముఖ హాస్పిటల్ అపోలో కి పోయే దారి, ప్రముఖ స్టూడియో లు ఉన్న ప్రాంతానికి వెళ్ళే దారి అయిన జూబ్లీహిల్స్ నియోజకవర్గం శ్రీ కృష్ణ నగర్ మెయిన్ రోడ్ లో ప్రతిరోజూ సాయంత్రం నిత్యం ట్రాఫిక్ జామ్. ట్రాఫిక్ అధికారులు ఈ సమస్యను స్వయంగా చూసి సమస్యను పరిష్కరించాల్సిందిగా శ్రీ కృష్ణ నగర్ బస్తీ వాసులు కోరుతున్నారు.

# జీలుగు సాగుతో అధిక దిగుబడులు

## 50శాతం సబ్సిడీపై జీలుగు విత్తనాల పంపిణీ

జనోదయ : చిగురుమామిడి

వ్యవసాయ పొలంలో రైతులు జీలుగు విత్తనాలు సాగు చేస్తే పొలం సారవంతంగా మారి అధిక దిగుబడులు సాధించవచ్చని హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి తెలిపారు.మండలంలోని సుందరగిరి రైతు వేదికలో హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతి రెడ్డి, చిగురుమామిడి సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకట రమణ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిలుగు విత్తనాలు పంపిణీ చేశారు.రాష్ట్ర ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై అందజేస్తున్న పచ్చి రొట్ట విత్తనాలు,జీలుగ విత్తనాలు అందిస్తుందన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిగురుమామిడి మండలానికి 330 క్వింటాల్ జీలుగ,50 క్వింటళ్లు జనము విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి తాటిపల్లి పున్నం చందర్ రెడ్డి తెలిపారు.భూ



సారం పెంపునకు జీలుగ పంట చాలా బాగా పని చేస్తుందని ,భూమిలోని పోషకాలను మొక్కలకు అందచేస్తుందని రైతులకు తెలిపారు.30కిలోల బస్తా 2.20 ఎకరాల్లో చల్లుకోవాలని ,రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సుందరగిరి సర్పంచ్ జంగా శిరీష, ఉప సర్పంచ్ మెడబోయిన రాజు,ఏఈవో అంజలి,అఖిల,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధూ ఔట్.. ముఖ్యమంత్రి పదవికి రేపు రాజీనామా

**న్యూఢిల్లీ, మే 26 :** కర్ణాటకలో నాయకత్వ రగడ నాటకీయ మలుపు తీసుకున్నది. కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశం మేరకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం రాజీనామా చేయనున్నారు. బుధవారం బెంగళూరులో ఆయన విలేకరుల సమావేశంలో తన నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉన్నది. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసి రాజ్యసభ ద్వారా ఢిల్లీకి మకాం మార్చాలని సిద్ధరామయ్యను కాంగ్రెస్ అధిష్ఠానం ఆదేశించినట్లు తెలుస్తున్నది. జాతీయ స్థాయిలో ఆయనకు మరింత పెద్ద పాత్ర ఇస్తామని హామీ ఇచ్చింది. భవిష్యత్తు సవాళ్లను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రంలో మార్పులు తీసుకురావడం, పార్టీని, ప్రభుత్వాన్ని పునర్వ్యవస్థీకరించడం వంటి చర్యలు చేపట్టాలని యోచిస్తున్నట్లు కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యమంత్రికి తెలియచేసినట్లు తెలిసింది.అధికార బదిలీ సున్నితంగా, గౌరవప్రదంగా జరుగాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనపై సంపూర్ణంగా ఆలోచించడానికి పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రికి సమయం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో నాయకత్వ మార్పు కోరుకుంటున్నట్లు పార్టీ నాయకత్వం నుండి స్పష్టమైన సంకేతం వెలువడినట్లు తెలుస్తున్నది. రాష్ట్ర పగ్గాలు చేపట్టేందుకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ చాలా కాలంగా తెరవెనుక వేచి చూస్తున్నారు. ఢిల్లీలో మంగళవారం ఆరుగంటలకు పైగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశం అనంతరం కర్ణాటకలో నాయకత్వ మార్పుపై వస్తున్న ఊహాగానాలను కాంగ్రెస్ సీనియర్ నాయకులు బహిరంగంగా తోసిపుచ్చిన కొద్దిసేపటికే ఈ పరిణామం చోటుచేసుకుంది. అంతేగాకుండా నేటి చర్చలు రాజ్యసభ, శాసనమండలి ఎన్నికలకు మాత్రమే పరిమితమయ్యాయని కూడా వారు స్పష్టం చేశారు. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, రాజ్యసభ ద్వారా జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశించి ఢిల్లీలో పెద్ద సంస్థాగత లేదా పరిపాలనా పాత్రను చేపట్టవచ్చని కాంగ్రెస్ నాయకత్వం సిద్ధరామయ్యకు తెలియచేసింది.మిగతా అన్ని విషయాలు, అన్ని సమస్యలు చూసుకుంటాం అని కూడా అధిష్ఠానం ఆయనకు హామీ ఇచ్చిందని కూడా వర్గాలు తెలిపాయి. ఢిల్లీలో కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో ఈ సమావేశం జరిగింది. సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్, కర్ణాటక ఇన్‌చార్జ్ రణదీప్ సుర్జేవాలా ఈ సమావేశంలో పాల్గొన్నారు. నాయకత్వ మార్పు అనివార్యమని పార్టీ వర్గాలు చెబుతుండగా కాంగ్రెస్ అధికారికంగా సిద్ధరామయ్య మార్పుపై ఎటువంటి చర్చ జరగలేదని ప్రకటించడం గమనార్హం. దాదాపు ఆరు గంటలకు పైగా జరిగిన చర్చల అనంతరం కేసీ వేణుగోపాల్ విలేకరులతో మాట్లాడుతూ తమ చర్చలు రాజ్యసభ, కర్ణాటక శాసన మండలి ఎన్నికలకు మాత్రమే పరిమితమైనట్లు స్పష్టం చేశారు.

# అదరహో ఆర్సీబీ.. వరుసగా రెండోసారి ఫైనల్లోకి

**92 రన్స్ తేడాతో గుజరాత్‌పై ఘన విజయం**
**చెలరేగిన కెప్టెన్ పాటిదార్, బౌలర్లు**

**ధర్మశాల:** ఐపీఎల్‌లో వరుసగా రెండోసారి కప్పు నెగ్గేందుకు ఆర్సీబీ అడుగు దూరంలో నిలిచింది.మంగళవారం జరిగిన క్వాలిఫయర్-1 మ్యాచ్‌లో 92 రన్స్ తేడాతో గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసి టైటిల్ ఫైట్‌కు దూసుకెళ్లింది. ఈహై స్కోరింగ్ పోరులో తొలుత ఆర్సీబీ 20 ఓవర్లలో 254/5 స్కోరు చేసింది. పాటిదార్‌కు తోడు విరాట్ కోహ్లీ (25 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 43), కృనాల్ పాండ్యా (28 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 43) రాణించారు. అనంతరం జీటీ 19.3 ఓవర్లలో 162 రన్స్‌కే కుప్పకూలి చిత్తుగా ఓడిపోయింది. రాహుల్ తెవాటియా (68),జోస్ బట్లర్ (29) టాప్ స్కోరర్లు. జాకబ్ డఫీ మూడు, రసిఖ్ దార్, భువీ, కృనాల్ రెండేసి వికెట్లతోదెబ్బ కొట్టారు. పాటిదార్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ అవార్డు లభించింది. ఈ మ్యాచ్‌లో ఓడిన గుజరాత్ ఫైనల్ చేరేందుకు మరో చాన్స్ ఉంది. బుధవారం సన్‌రైజర్స్-రాజస్థాన్ మధ్య ఎలిమినేటర్ మ్యాచ్‌లో నెగ్గే జట్టుతో శుక్రవారం జరిగే క్వాలిఫయర్-2లో తలపడనుంది.బ్యాటర్లు విజృంభించిన పిచ్‌పై బౌలర్లూ సత్తా చాటడంతో ఆర్సీబీ విజయం తేలికైంది. భారీ ఛేదనలో గుజరాత్ ఆరంభంలోనే తడబడింది. ఫామ్‌లో ఉన్న టాప్-3 బ్యాటర్లను పవర్ ప్లేలోనే కోల్పోయిన జీటీ ఏ దశలోనూ ప్రత్యర్థికి పోటీ ఇవ్వలేకపోయింది. జాకబ్ డఫీ వేసిన మూడో ఓవర్లో ఓపెనర్ సుదర్శన్ (14)ను దురదృష్టం వెంటాడించింది. మూడో బంతిని పాయింట్ దిశగా ఆడిన తర్వాత అతని చేతుల్లోంచి బ్యాట్ జారిపోయి వికెట్ల మీద పడటంతో హిట్ వికెట్‌గా వెనుదిరిగాడు. కొత్త బాల్‌తో అద్భుతంగా బౌలింగ్ చేసిన భువనేశ్వర్.. కెప్టెన్ గిల్ (2)ను క్లీన్ బౌల్డ్ చేయడంతో జీటీ 27/2తో ఇబ్బందుల్లో పడింది.తన బౌలింగ్‌లో వరుసగా 4,6,4 కొట్టిన బట్లర్‌ను తర్వాతి బాల్‌కే లెగ్ కట్టర్‌తో ఔట్ చేసిన హేజిల్‌వుడ్ ప్రతీకారం తీర్చుకున్నాడు. ఆరో ఓవర్లో నిశాంత్ సింధు (5)ను అద్భుతమైన రిటర్న్ క్యాచ్‌తో ఔట్ చేసిన రసిఖ్ దార్ వెంటనే కోహ్లీ క్యాచ్‌తో జేసన్ హోల్డర్ (0)నూ పెవిలియన్ చేర్చడంతో జీటీ 51/5తో పీకల్లోతు కష్టాల్లో పడింది. సుందర్ (8), రషీద్ ఖాన్ (8) ను డఫీ ఔట్ చేయగా.. రబాడ (9) కూడా నిరాశపరచడంతో గుజరాత్ వందలోపే ఆలౌటయ్యే లా కనిపించింది. కానీ, ఓ ఎండ్‌లో సిరాజ్ (5)ను నిలబెట్టి పోరాడిన ఇంపాక్ట్ ప్లేయర్ రాహుల్ తెవాటియా అర్ధ శతకం పూర్తి చేసుకోవడంతో పాటు స్కోరు 150 దాటించి ఓటమి అంతరాన్ని తగ్గించాడు.కెప్టెన్ రజత్ పాటిదార్ ముందుండి నడిపించడంతో ఆర్సీబీ భారీ స్కోరు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆ టీమ్ ఆరంభం నుంచే పవర్ హిట్టింగ్‌తో అదరగొట్టింది. సిరాజ్ తొలి ఓవర్లోనే మూడు ఫోర్లు కొట్టిన ఓపెనర్ వెంకటేశ్ అయ్యర్ (19).. రబాడ బౌలింగ్‌లో సిక్స్ కొట్టి వెంటనే ఔటయ్యాడు. వన్‌డౌన్‌లో వచ్చిన దేవదత్ పడిక్కల్ (30) తోడుగా కింగ్ కోహ్లీ జట్టుకు బలమైన పునాది వేశాడు. రబాడ బౌలింగ్‌లో కోహ్లీ 4,4,6 కొట్టడంతో పవర్‌ప్లేలోనే 76 రన్స్ వచ్చాయి. ఫీల్డింగ్ మారిన తర్వాత టైటాన్స్ బౌలింగ్ మెరుగైంది. పేసర్ హోల్డర్, స్పిన్నర్ రషీద్ వరుసగా నాలుగు ఓవర్లు కట్టడి చేశారు. ఈక్రమంలో రెండు బంతుల తేడాతో కోహ్లీ, పడిక్కల్‌ను ఔట్ చేసిన హోల్డర్ ఆర్సీబీ స్పీడుకు బ్రేకులు వేశాడు. దాంతో సగం ఓవర్లకు 99/3తో నిలిచిన ఆ జట్టు 200



చేసినా మంచి స్కోరే అనిపించింది. కానీ, సెకండాఫ్‌లో రజత్ పాటిదార్ షో మొదలైంది. కృనాల్ పాండ్యా తోడుగా అతను భారీ షాట్లతో విజృంభించాడు. హోల్డర్ బౌలింగ్‌లోనే సిక్స్‌తో స్కోరు వంద దాటించాడు. ప్రసిధ్ వేసిన 14వ ఓవర్లో రజత్ ఇచ్చిన రెండు క్యాచ్‌లను వదిలేయడం గుజరాత్ పాలిట శాపంగా మారింది. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్న ఆర్సీబీ కెప్టెన్ మరింత రెచ్చిపోయాడు. కుల్వంత్ వేసిన 15వ ఓవర్లో కృనాల్ రెండు ఫోర్లు కొడితే.. పాటిదార్ 4,6,4 దంచడంతో 28 రన్స్ లభించాయి.అదే జోష్‌లో రషీద్ బౌలింగ్‌లో కృనాల్ ఓ సిక్స్, పాటిదార్ రెండు సిక్సర్లు రాబట్టారు. తర్వాతి ఓవర్లో కృనాల్‌ను హోల్డర్ ఔట్ చేసి 95 పరుగుల భాగస్వామ్యాన్ని ముగించినా రజత్ అస్సలు తగ్గలేదు. వరుసగా రెండు సిక్సర్లతో 21 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. టిమ్ డేవిడ్ (4) నిరాశ పరిచినా.. చివర్లో జితేశ్ (15 నాటౌట్) తోడుగా రజత్ మరింత జోరు పెంచాడు. సిరాజ్ వేసిన 19వ ఓవర్లో 6, 4.. ప్రసిధ్ వేసిన ఆఖరి ఓవర్లో మరో రెండు భారీ సిక్సర్లు కొట్టి స్కోరు 250 దాటించాడు. అతని ధాటికి ఆఖరి ఆరు ఓవర్లలోనే ఆర్సీబీ ఏకంగా 114 పరుగులు పిండుకోవడం గమనార్హం.






వాస్తవం:హైదరాబాద్

అత్యున్నత స్థాయి మౌలిక సదుపాయాలు, ప్రతిభావంతులతో కూడి ట్యాలెంట్ పూల్ అందుబాటులో ఉండటం వల్ల ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు తమ గ్లోబల్ సామర్థ్య కేంద్రాల (జిసిసి) ఏర్పాటుకు హైదరాబాద్‌ను ఎంపిక చేసుకుంటున్నాయిని ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. జిసిసిల రాకతో మన ఐటి ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు ఉద్యోగావకాశాలు పెరుగుతాయని ఆయన అన్నారు.న్యూయార్క్ లోని ట్యారిటౌన్ కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న బయోటెక్ దిగ్గజం రీజెనరాన్ అమెరికా వెలుపల మొదటి జిసిసిని ఏర్పాటు చేయడానికి తెలంగాణా రాష్ట్రాన్ని ఎంపిక చేసుకోవడం మన ప్రతిష్ఠను మరింత పెంచుతుందని ఆయన సంతోషం వ్యక్తం చేసారు. రీజనరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెండ్ బ్యారీ కోవల్ ఆధ్వర్యంలో ఓ ప్రతినిధి బృందం మంగళవారం నాడు డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో బేటీ అయింది. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో జిసిసి ఏర్పాటుకు సంబంధించి బ్యారీ కోవల్. తెలంగాణా లైఫ్ సైన్సెస్ సిఇఓ సర్వేశ్ సింగ్ లు అవగాహన పత్రాల (ఎంఓయు)ను మార్చుకున్నారు. అనంతరం శ్రీధర్ బాబు మాట్లాడుతూ రెజెనరాన్‌కు ఐర్లాండ్, యూకే, జర్మనీ, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో కార్యాలయాలు, ఉత్పత్తి కేంద్రాలు ఉన్నప్పటికీ, హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనున్నజిసిసి ప్రత్యేకమైన గ్లోబల్ హబ్‌గా పనిచేస్తుందని తెలిపారు.. ఇది ప్రపంచ వ్యాప్తంగా సంస్థ కార్యకలాపాలను సమన్వయం చేస్తూ క్లినికల్ ట్రయల్స్ నిర్వహణ, అధునాతన డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇంజినీరింగ్, కమర్షియల్ అనలిటిక్స్ వంటి అత్యున్నత స్థాయి డిజిటల్ సేవలను అందిస్తుందని చెప్పారు.ప్రస్తుతం హైదరాబాద్‌లో దాదాపు 450 గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు పనిచేస్తుండగా, మరిన్ని అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులకు ముందుకు వస్తున్నాయని శ్రీధర్ బాబు తెలిపారు. జిసిసి ల కేంద్రంగా ముంబయి, ఢిల్లీ, చెన్నైలను అధిగమించి హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచిందని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. బయోటెక్నాలజీ, లైఫ్ సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, డిజిటల్ టెక్నాలజీల రంగాల్లో ఉన్న బలమైన ఎకోసిస్టం ప్రపంచ కంపెనీలను ఆకర్షిస్తోందన్నారు.తెలంగాణ ప్రభుత్వం పరిశోధన, తయారీ రంగం, పారిశ్రామిక విధానాలు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోందని శ్రీధర్ బాబు తెలిపారు. జీనోమ్ వ్యాలీ విస్తరణ, త్వరలో ఏర్పాటు కానున్న గ్రీన్ ఫార్మా సిటీ వంటివి రాష్ట్ర లైఫ్ సైన్సెస్ రంగాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు.రెజెనరాన్ సంస్థ ఏర్పాటు చేయనున్న గ్లోబల్ కెపబిలిటీ సెంటర్ ద్వారా రాబోయే సంవత్సరాల్లో పెద్ద సంఖ్యలో ఉన్నత స్థాయి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ప్రపం చంలో ప్రముఖ బయోటెక్నాలజీ సంస్థల్లో ఒకటైన రెజెనెరాన్ ఇప్పటికే అనేక ఔషధా లను అభివృద్ధి చేసి ప్రపంచవ్యాప్తంగా సేవలు అందిస్తోందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో రెజెనెరాన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బ్యారి కోవాల్, రెజెనెరాన్ జీసీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజీవ్ ఓనాట్, సంస్థ ప్రతినిధులు, పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.